# "ధర్మో రక్షతి రక్షితః'

*ప్రేమస్వరూపులారా!*

చాలామంది స్త్రీలు స్వామి మాట్లాడే తెలుగు పదములు వినాలని ఆశిస్తున్నారు. "విద్యార్థులెన్నియో విద్యలు నేర్చి టెక్నికల్, ఇంజనీరింగ్ విషయాలంతా చెబుతున్నారు. వారిని స్వామికూడా ప్రోత్సహిస్తున్నారు. కాని, అలాంటివి మాకేమాత్రం అర్థం కావడం లేదు. స్వామి తెలుగులో మాట్లాడితే వినాలని ఉంది", అని కోరుతున్నారు.

**చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెం**
**పెక్కిన తేనెకన్న అతి రుచ్యము నోటను పల్కపల్కగా**
**మిక్కిలి కమ్మనౌ అమృతమే యనిపించును గాన మీరు ఈ**
**చక్కని దాని మనసా స్మరియింపుడు రామనామమున్!**

ప్రేమస్వరూపులారా! భారతదేశములో రామ మందిరము లేని గ్రామము లేదు. ఏ గ్రామములో చూచినా 'రామా' అనే పేరు గలవారు తప్పకుండా ఉంటారు. రామనామము ప్రాచీనకాలమునుండి ఏవిధముగాను మార్పుచెందక దేదీప్యమానంగా వెలుగొందుతూ వస్తున్నది. నాస్తికులు, ఆస్తికులు, ఆస్తిక నాస్తికులుకూడను 'రామా' అనే పేరును ఉచ్చరిస్తూనే ఉన్నారు. నేలపై కూర్చున్న వ్యక్తి లేచి నిలబడే సమయంలో 'రామా' అనడం మనము వింటూ ఉంటాము. రామనామము కేవలం భారతదేశములోనే కాదు, చైనాలో కూడను ప్రసిద్ధి గాంచినది. ప్రపంచమంతయు రామమయమే!

**పుత్రకామేష్టి క్రతువు**

దశరథునకు చాలా కాలంవరకు పుత్ర సంతానం కలుగలేదు. తన ముగ్గురు భార్యలలో ఎవరివల్లనైనను వంశోద్ధారకుడైన కుమారుడు కలుగుతాడేమోనని ఎంతో ఆశిస్తూ

sri sathyasai vachanamrutam

**తేదీ 1.10.2006, విజయదశమి, సాయికుల్వంత్ హాలు**

వచ్చాడు. పుత్రసంతాన ప్రాప్తి నిమిత్తమై తపస్సు గావిస్తూ వచ్చాడు. ఆ కాలంలోగాని, ఈ కాలంలోగాని ఎప్పటికైనను చేసిన తపస్సు ఫలించే తీరుతుంది. దశరథుడు తన ముగ్గురు భార్యలతో కలిసి పుత్రకామేష్టి క్రతువును ఆచరించగా యజ్ఞపురుషుడు ప్రత్యక్షమై ఒక పాత్ర నందించి, "నాయనా దశరథా! ఈ పాత్రలో ఉన్న పాయసమును నీ ముగ్గురు భార్యలకు సమానంగా పంచు", అని చెప్పాడు. కాని, కొన్ని గ్రంథములలో మరోవిధంగా వ్రాయబడి ఉంది. దశరథుడు ఆ పాయసమును ముగ్గురికీ సమానంగా పంచలేదని, ఒకరికి ఎక్కువ, ఒకరికి తక్కువ పంచాడని చెబుతారు. ఇది చాలా పొరపాటు. దశరథుడు వసిష్ఠులవారి సమక్షంలో మూడు గిన్నెల్లో పాయసమును సమానంగా పోసి తన భార్యలకు అందించాడు. 'మీ అభీష్టము సిద్ధించుగాక!' అని వసిష్ఠులవారు వారిని ఆశీర్వదించారు. రాణులు ఎంతో ఆనందంతో వారివారి పాయసపుగిన్నెలను తీసికొని వారి పూజా మందిరాలకు వెళ్లారు.

కేకయరాజు తన కుమార్తెయైన కైకేయిని దశరథ మహారాజుకిచ్చి పెండ్లి చేసినప్పుడు, 'నా కుమార్తెకు పుట్టిన కుమారునికే నీవు పట్టం కట్టాలి', అని షరతు విధించాడు. తప్పక అట్లే చేస్తానని దశరథుడు వాగ్దానం చేశాడు. అందుచేత, కైక తనకు పుట్టబోయే కుమారుడే రాజు కాగలడని చాలా ఆనందంగా ఉన్నది. ఇక, కౌసల్య తాను పట్టపురాణి కనుక తనకు కలిగే కుమారునికే దశరథుడు పట్టం కట్టగలడన్న ఆశతో ఎంతో సంతోషంగా ఉన్నది. కాని, సుమిత్రకు ఇట్టి ఆశ లేదు. ఆమె అభ్యంగస్నానమాచరించి కురులార్చుకోవడానికి మేడపైకి వెళ్ళింది. ఆనాడు ఫ్యాన్లు, హెయిర్ డ్రయర్లు లేవు కదా! ఆమె తన పాయసపు గిన్నెను మేడపై పెట్టి, కురులార్చుకుంటున్న సమయంలో ఒక గద్ద వచ్చి ఆ గిన్నెను తన్నుకుపోయింది. ఈమెకు చాలా భయమేసింది. 'పాయసపు గిన్నె పోతే పోయింది. కాని, నా పతి, గురువుగారు నా అలక్ష్యానికి నన్నేమని నిందిస్తారో ఏమిటో!' అని తనలో తాను బాధపడుతూ వెంటనే క్రిందికి దిగి వచ్చింది. అక్కడ కౌసల్య, కైక ఇరువురూ ఆమెకోసం కాచుకొని ఉన్నారు. "ఏమక్కా! ఎందుకు నీవింత కంగారు పడుతున్నావు?" అని కైక ప్రశ్నించి, జరిగిన సంగతి తెలుసుకొని "అక్కా! నీవేమీ బాధపడనక్కర్లేదు. ఇదిగో, నా పాయసంలో కొంత నీకిస్తాను" అని చెప్పి ఒక గిన్నెను తెచ్చి తన పాయసంలో కొంతభాగం అందులో పోసింది. విశాలమైన హృదయం కలిగిన కౌసల్యకూడను తన పాయసంలో

కొంతభాగం సుమిత్ర గిన్నెలో పోసింది. వాళ్లు ముగ్గురూ స్వంత అక్కచెల్లెళ్లవలె అన్యోన్యమైన ప్రేమానురాగాలతో మెలగేవారేగాని, ఈనాటి సవతులవలె ఒకరితో ఒకరు పోట్లాడుకునేవారు కాదు. ముగ్గురూ మూడు గిన్నెలలో పాయసమును తీసికొని గురువుగారి దగ్గరకు వెళ్లారు. వసిష్ఠులవారు "అమ్మా! గుణవంతులైన, చిరంజీవులైన, ధీరాధివీరులైన, ప్రజారంజకంగా రాజ్యాన్ని పరిపాలించే కుమారులు మీకు జన్మింతురుగాక!" అని వారిని ఆశీర్వదించారు.

**లక్ష్మణుడు రామాంశము, శత్రుఘ్నుడు భరతాంశము**

మొదట కౌసల్యకు ఒక కుమారుడు పుట్టాడు. అతని తేజస్సును, ప్రకాశమును చూసి వసిష్ఠులవారు అతనికి రాముడని పేరుపెట్టారు. రాముడనగా సర్వులను రమించువాడని అర్థం. కైకేయికి పుట్టిన కుమారునికి భరతుడు అని నామకరణం చేశారు. సుమిత్రకు మాత్రమే ఇరువురు కుమారులు పుట్టటం వసిష్ఠులవారికి ఆశ్చర్యం కలిగించింది. అయితే, యోగదృష్టితో పరికించి ఆయన జరిగిన కథను తెలుసుకున్నారు. కౌసల్య ఇచ్చిన పాయస భాగము నుండి లక్ష్మణుడు, కైక ఇచ్చిన పాయస భాగమునుండి శత్రుఘ్నుడు పుట్టారని ఆయన గుర్తించారు. రామునిలో అర్ధభాగము లక్ష్మణుడు, భరతునిలో అర్ధభాగము శత్రుఘ్నుడు. 'రాముడు రాజయితే లక్ష్మణుడు అతనికి సేవకునిగా ఉండాలి. భరతుడే గనుక రాజయితే శత్రుఘ్నుడు అతనికి సేవకునిగా ఉండాలి. నా కుమారులకు రాజ్యమక్కరలేదు. ఒకరు రామునికి, ఒకరు భరతునికి సేవ చేస్తూ ఉంటే చాలు', అనుకొని సుమిత్ర తృప్తిపడింది.

లక్ష్మణ, శత్రుఘ్నులు పుట్టినప్పటినుండి ఏడుస్తూనే ఉన్నారు. నిద్ర పోలేదు, పాలు త్రాగలేదు. సుమిత్ర పిల్లలిరువురికీ మంత్రాలు వేయించింది; యంత్రాలు కట్టించింది; విభూతి పెట్టించింది; అనేక రకములైన చికిత్స చేయించింది. కాని, ఫలితం లేకపోయింది. అప్పుడామె వసిష్ఠులవారి దగ్గరకు వెళ్ళి తన సమస్యను విన్నవించింది. అప్పుడాయన, "అమ్మా! లక్ష్మణుడు రామాంశము, శత్రుఘ్నుడు భరతాంశము. కనుక, నీవు లక్ష్మణుణ్ణి రాముడు పడుకున్న తొట్లెలో పరుండబెట్టు. శత్రుఘ్నుని భరతుని ప్రక్కన పరుండబెట్టు" అని



srisathyasaivachanamrutam

సలహా ఇచ్చారు. సుమిత్ర కౌసల్యకు, కైకేయికి ఈవిషయం చెప్పి, వారి అంగీకారంతో లక్ష్మణుణ్ణి రాముని ప్రక్కన, శతృఘ్నుణ్ణి భరతుని ప్రక్కన పరుండబెట్టింది. తక్షణమే వారు ఏడ్పుమాని ఆనందంతో కేరింతలు కొట్టసాగారు. అప్పటినుండి రాముణ్ణి లక్ష్మణుడు, భరతుణ్ణి శతృఘ్నుడు నీడవలె అనుసరిస్తూవచ్చారు. వివాహమైన తరువాత భరతుణ్ణి అతని మేనమామయైన కేకయరాజు తన రాజ్యానికి తీసుకు వెళ్ళినప్పుడు అతని జతలో శతృఘ్నుడుకూడా వెళ్ళాడు. రాముడు తండ్రి ఆజ్ఞను శిరసావహించి అరణ్యానికి వెళుతుంటే, తండ్రి చెప్పకుండానే అతని జతలో లక్ష్మణుడుకూడా వెళ్లాడు. ఈవిధంగా రాముని జతలో లక్ష్మణుడు, భరతుని జతలో శతృఘ్నుడు సంచరిస్తూ ఉంటే, చూసేవారికి రామ లక్ష్మణులు వేరు, భరత శతృఘ్నులు వేరు అనిపించేది. కాని, నలుగురి మధ్య గల అన్యోన్య సోదర ప్రేమ సాటిలేనిది.

**మాయలేడి**

సీతారామలక్ష్మణులు అరణ్యంలో సంచరిస్తూ ఉండగా వారికొక ఆశ్రమం కనిపించింది. అది ఎవరి ఆశ్రమమని విచారించి చూడగా, అగస్త్యుని ఆశ్రమ మని తెలిసింది. సీతారామలక్ష్మణులను చూసి అగస్త్య మహర్షి, ఇతర ఆశ్రమ వాసులు ఎంతగానో ఆనందించి వారికి స్వాగతం పలికారు. తరువాత మాటల సందర్భంలో అగస్త్య మహర్షి, "రామా! ఇక్కడికి కొద్ది దూరంలోనే దండకారణ్యం ఉన్నది. అక్కడ మీకు భుజించడానికి కావలసినన్ని పండ్లు లభిస్తాయి. అక్కడే పవిత్ర గోదావరికూడా ప్రవహిస్తోంది. అక్కడ మీకు అన్నివిధాలుగా సౌకర్యంగా ఉంటుంది. సీతమ్మకు కూడా ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉంటుంది. కాబట్టి, మీరు అక్కడ నివాసం ఏర్పర్చుకోండి", అని సలహా ఇచ్చాడు. అగస్త్యుని సలహా ననుసరించి, సీతారామలక్ష్మణులు దండకారణ్యంలో పంచవటీ తీరమున పర్ణశాలను నిర్మించుకొని సుఖంగా కాలం గడుపుతూ వచ్చారు. ఆ ఆశ్రమంలో అనేకరకములైన జంతువులు సంచరిస్తూ ఉండేవి. ఒకనాడు సీత ఒక బంగారు లేడిని చూడటం తటస్థించింది. తనకున్న బంగారు ఆభరణాలన్నింటినీ అయోధ్యలోనే వదలిపెట్టి అరణ్యానికి వచ్చిన సీతకు బంగారు లేడిపై వ్యామోహం ఎందుకు పుడుతుంది! కాని, విధి బలీయము. బంగారు లేడి ఉండటానికి వీల్లేదని తెలిసికూడను దానిని పట్టితెమ్మని ఆమె

srisathyasaivacharamrutam

రాముని కోరింది. "రామా! ఎంత అందంగా ఉన్నదీ లేడి! దానిని పట్టి తెస్తే మన ఇంటి దగ్గర పెట్టుకొని దానితో ఆడుకుంటూ హాయిగా కాలక్షేపం చేయవచ్చు. మీరు అరణ్యంలో తిరుగుతుంటే నేను ఇంటివద్ద ఒంటరిగా ఉండవలసి వస్తోంది. నాకీ కొద్దిపాటి ఆనందాన్ని అందించరా?" అని అభ్యర్థించింది. "సరే, నీ ఆనందమే మా ఆనందము" అని రాముడు ఆ బంగారు లేడిని పట్టి తీసుకు రావడానికి సంసిద్ధుడయ్యాడు. అప్పుడు లక్ష్మణుడు, "అన్నా! ఇది బంగారు లేడి కాదు, మాయలేడి. ఎవరో రాక్షసుడు మాయపన్ని ఈవిధమైన రూపాన్ని ధరించినట్లు నాకనిపిస్తున్నది. అయినా, దానిని పట్టి తేవడానికి నీవు పోనక్కర్లేదు. నేను వెళతాను", అన్నాడు. కాని, ఆపదలొచ్చే సమయంలో బుద్ధి సరిగా పనిచేయదంటారు. "రామా! నీవు మాత్రమే దానిని పట్టుకొని తీసుకురాగలవు", అంటూ సీత రాములనే వెళ్లవలసిందిగా బలవంతం చేసింది. సీత ప్రోద్బలంచేత రాముడు ఆ మాయలేడిని తరుముకుంటూ వెళ్ళాడు. కొంతదూరం వెళ్లిన తరువాత అంబును విడిచాడు. అది తాకేసరికి ఆ రాక్షసుడు తన నిజరూపాన్ని ధరించి, 'హా సీతా! హా లక్ష్మణా!' అంటూ ప్రాణం విడిచాడు.

**సీతాపహరణం**

అది రాముని గొంతు మాదిరి వినిపించడంతో సీత, "లక్ష్మణా! తక్షణమే మీ అన్నగారికి సహాయంగా వెళ్లు. ఆయన ఏదో ఆపదలో చిక్కుకొని మనల్ని పిలుస్తున్నట్లున్నాడు", అన్నది. అప్పుడు లక్ష్మణుడు, "అమ్మా! ఇదేదో రాక్షస మాయ కావచ్చు. రామునికి ఎట్టి ఆపదా సంభవించడానికి వీల్లేదు. నీవు ధైర్యంగా ఉండు", అన్నాడు. లక్ష్మణుడు అక్కడినుండి కదలకపోవడంతో సీత అతనిపై అనేకరకాలుగా నిందలు వేసింది. "రాముడు పోతే నీవు నన్నేలాలని చూస్తున్నావా?" అంటూ చెడ్డ మాటలు మాట్లాడింది. ఈ మాటలు వినలేక లక్ష్మణుడు తక్షణమే అక్కడినుండి బయలుదేరాడు. ఐతే, వెళ్ళే ముందు ఆశ్రమం చుట్టూ ఒక గీత గీశాడు. "తల్లీ! నీవు నన్ను తిడితే తిట్టావు. కాని, ఎట్టి పరిస్థితిలోనూ ఈ గీతను దాటి బయటికి రావద్దు. రాక్షసులుగాని, మృగములు గాని, ఏవిధమైన క్రిమికీటకాదులుగాని దీనిని దాటి లోపలికి రావడానికి వీలుకాదు", అని చెప్పాడు. ఈనాటికికూడను బజార్లో అమ్ముతుంటారు, 'లక్ష్మణ రేఖ' అని. ఏ క్రిమి కీటకాదులుకూడా ఆ గీతను దాటిరాలేవు.

sri sathyasai vahini

రావణునికి కూడా లక్ష్మణుడు గీసిన గీతను దాటి లోపలికి రావడానికి వీల్లేకపోయింది. బయటనే నిలబడి, 'భవతీ భిక్షాం దేహి' అని దీనంగా అరుస్తున్నాడు. 'అయ్యో పాపం, ఆకలిగొని ఉన్న వ్యక్తిని ఈవిధంగా బాధ పెట్టడం న్యాయం కాదు', అనుకొని సీత అతనికి భిక్షం వేసే నిమిత్తం గీతను దాటి బయటికి వచ్చింది. గీతను దాటిన తక్షణమే రావణుడు ఆమెను అపహరించి లంకకు తీసుకుపోయాడు. రామ లక్ష్మణులు తిరిగి వచ్చిన తరువాత సీత అపహరణకు గురి అయినదని గ్రహించి చాలా విచారించారు.

**అశోకవనంలో సీత**

లక్ష్మణుడు చెప్పిన మాటలను విననందుకే తనకీ దురవస్థ కలిగిందని అశోకవనంలో కూర్చుని సీత చాలా బాధపడుతూ వచ్చింది.

**"ఈ చెఱలోనుంచి వెళ్లేనా!**
**నే ఇక రాముల కన్నుల చూచేనా!**
**నా ముద్దు మరిది ఓ లక్ష్మణా!**
**నిన్ను దుర్భాషలాడితి సద్గుణా!"**

"లక్ష్మణా! నోటికి వచ్చినట్లుగా మాట్లాడి నీ హృదయాన్ని గాయపరచినందుకు నేను తగిన శిక్షను అనుభవిస్తున్నాను", అని పశ్చాత్తాపపడుతూ వచ్చింది. ఈవిధంగా సీత లంకలో పది నెలలు గడిపినది. ఐతే, ఒక్కనాడైనా ఆమె రావణుని ముఖము చూడలేదు. వాడు రాముణ్ణి చులకనచేసి మాట్లాడుతుంటే సీత కోపోద్రిక్తురాలై, "ఛీ! నీవు రాముని కాలిగోటికికూడా సరితూగవు. రాముడు మహాధీరుడు, వీరుడు, గంభీరుడు. నీవు హీనుడవు, అల్పుడవు. రాముని పేరు ఉచ్చరించటానికికూడా నీకు అర్హత లేదు", అన్నది. చిట్టచివరికి రావణుడు "ఇక నీకు పది రోజులు గడువిస్తున్నాను" అని మూర్ఖంగా పలికి అక్కడినుండి వెళ్ళిపోయాడు. "నా మనస్సే నాకు సాక్షి. కాబట్టి, నన్నెవరూ ఏమీ చేయలేరు" అనుకొని సీత రామచింతన చేస్తూ ధైర్యంగా ఉన్నది. సీతకు కాపలాగా నియమింపబడిన రాక్షస స్త్రీలలో అజట, త్రిజట అనేవారున్నారు. వారు విభీషణుని బిడ్డలు. ఒకనాడు త్రిజట దుఃఖిస్తున్న సీతను ఓదార్చుతూ, "అమ్మా! రాత్రి నాకొక స్వప్నం వచ్చింది. ఎవరో ఒక కోతి వచ్చి

srisathyasaivachanamrutam

లంకను కాల్చినట్లు, రాముడు వచ్చి రావణుని సంహరించి నిన్ను అయోధ్యకు తీసికొని వెళ్లినట్లు నాకు స్పష్టంగా కనిపించింది", అన్నది. అజట కూడా, "నిజమేనమ్మా! నాకుకూడా అదేవిధమైన స్వప్నం వచ్చింది. నీవింక విచారించనక్కర్లేదు", అని ధైర్యం చెప్పింది. వారికి సీతపైన చాలా ప్రేమ, విశ్వాసము. విభీషణుడు రామభక్తుడు. కాబట్టి, అతని బిడ్డలుకూడా రామభక్తినే ప్రకటిస్తూ వచ్చారు. ఈవిధంగా పదినెలలు గడిచిపోయాయి. ఒకనాడు ఉన్నట్లుండి లంకలో పెద్ద అల్లకల్లోలం చెలరేగింది. ఏమిటని విచారిస్తే, రామ రావణ యుద్ధం ప్రారంభమైందని తెలిసింది. కొద్ది రోజుల్లో రావణుని మరణవార్తకూడా వచ్చింది.

**అగ్నిపరీక్ష**

ఎట్టకేలకు ఈ చెఱనుండి విముక్తి పొంది రాముని సన్నిధికి చేరుకుంటున్నా నని సీత ఎంతగానో ఆనందించింది. ఐతే, తాను రామునివద్దకు వెళ్ళాలా? లేక రాముడే స్వయంగా తనవద్దకు వచ్చి తనను తీసికొని వెళతాడా? అని ఆమె మనసులో ఒక సందేహం నెలకొన్నది. ఇంతలో రాముడు సీతను తనవద్దకు తీసికొని రావలసిందిగా ఆదేశించాడు. వానరులంతా అక్కడికి వచ్చారు. అసలే వానరులు, ఇంక వాళ్ల సంగతి చెప్పనక్కర్లేదు. సీతమ్మను చూడాలనే ఆశతో ఒకరిపై ఒకరు ఎగురుతున్నారు, దుముకుతున్నారు. సీతమ్మను చూసి వాళ్లు ఎంతో హృదయానందము నొందారు. అందరూ కలిసి ఆమెను రామునివద్దకు తీసికొని వెళ్లారు. కాని, రాముడు ఆమెవైపు చూడలేదు. సీత అగ్నిలో ప్రవేశించి తన పవిత్రతను నిరూపించుకునే నిమిత్తం చితిని పేర్చమని అక్కడున్నవారిని ఆదేశించాడు. సీత గుణవంతురాలని, మహాపతివ్రత అని తనకు తెలుసు. కాని, లోకానికి కూడా తెలియాలి కదా! 'పది నెలలు లంకలో ఉన్న సీతను రాముడు ఏవిధంగా స్వీకరించాడు?' అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. కనుకనే, సీతను అగ్నిపరీక్షకు గురిచేశాడు. ఈ సత్యాన్ని గుర్తించిన సీత అగ్ని చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి, రాముని తల్చుకుంటూ అందులోకి దూకింది. తక్షణమే అగ్నిదేవుడు ప్రత్యక్షమై, "రామా! ఈమె మహాపతివ్రత, మహాసాధ్వీమణి. ఈమెను నీవు సందేహించడం న్యాయం కాదు. దయ చేసి ఈమెను స్వీకరించవలసింది", అని పలికి సీతను రామునికి అప్పజెప్పాడు. సీతయొక్క పవిత్రత

sri sathyasai vachanamrutam

అందరికీ ప్రత్యక్షంగా నిరూపణ అయింది.

ఈ సంఘటన సీతయొక్క సత్యప్రమాణమును, పాతివ్రత్య మహిమను ప్రపంచానికి చాటింది. విభీషణుడు సీతారామలక్ష్మణులను పుష్పకవిమానంలో అయోధ్యకు చేర్చాడు. శ్రీరామపట్టాభిషేకం వైభవోపేతంగా జరిగింది. రామరాజ్యంలో అందరూ సుఖశాంతులతో జీవిస్తూ వచ్చారు. ఆ కాలంలో స్త్రీలను వారి పతివ్రతా ధర్మమే రక్షిస్తూ వచ్చింది.

**గత జీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి**
**సావిత్రి భారత సతియె కాదె**
**తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె**
**చంద్రమతి భారత వనిత కాదె**
**కులసతీత్వమునకై గుండాన దూకిన**
**సీత భారతధరా జాత గాదె**
**కినిసి దుర్మద కిరాతుని బూది గావించె**
**దమయంతి భారత రమణి గాదె**

పతివ్రతా ధర్మమనేది ఒక్క భారతదేశమునకు మాత్రమే పరిమితమైయున్నది. ఏ ఇతర దేశమునందుకూడను ఇది కానరాదు. ఆ కాలంలో ఆడవారు కనిపిస్తే మగవారు తలవంచుకొని వెళ్ళేవారు. కాని, ఇప్పుడు చూస్తామా అంటే, బజార్లో నిలబడి ఒకరితో ఒకరు మాట్లాడుతుంటారు. ఇటువంటి దృశ్యం ద్వాపర యుగాంతంలో ఒకనాడు ధర్మరాజు కంటపడింది. వెంటనే తన సోదరులను సమావేశపరచి, "కలియుగం ప్రారంభమైంది. నిన్నటి దినము నేను నగరంలో సంచరిస్తుంటే ఒక స్త్రీ వచ్చి ఒక పురుషునితో మాట్లాడటం చూశాను. ఇటువంటి అనైతిక ప్రవర్తనను నేను చూడలేను", అన్నాడు. ఇంకొకరోజు అర్జునుడు వచ్చి "ఈరోజు సాయంకాలం ఒక రైతు తన పొలం నుండి నాగలిని ఇంటికి తీసుకు పోవడం చూశాను. 'ఎందుకయ్యా, దీనిని ఇంటికి మోసుకెళుతున్నావు? పొలంలోనే వదలిపెట్టి వెళ్ళకూడదా?' అని అడిగితే, 'అయ్యో, అలా చేయడానికి వీల్లేదు స్వామీ, దీనిని పొలంలో వదలిపెట్టిపోతే ఎవరో దొంగలు వచ్చి ఎత్తుకెళుతున్నారు", అన్నాడు. ఇంకొకరు

srisathyasaivachanamrutam

తమ ఇంటికి తాళం వేసుకొని వెళ్లడం కనిపించింది. 'ఎందుకమ్మా తాళం వేయడం?' అని అడిగితే, 'తాళం వేయకపోతే ఇంట్లోకి ఎవరో దూరి సామాన్లు తీసికొని పోతున్నారు', అని చెప్పింది. కలియుగం ప్రారంభమైనది. కనుకనే, ఈ దుర్లక్షణములు కనిపిస్తున్నవి", అన్నాడు.

రాముని కాలంలో ఇళ్లకు తాళాలు వేయడంగాని, పంటపొలాల్లో ఉన్న సామగ్రిని మోసుకొని ఇంటికి తెచ్చుకోవడంగాని, వీధుల్లో ఆడ, మగ ఇరువురూ చేరి మాట్లాడుకోవడంగాని జరిగేవి కావు. కలిప్రభావముచేతనే ఇలాంటివన్నీ ప్రారంభమైనాయి. "కలికాలం ప్రారంభమైంది కనుక మనము ఇక నిష్క్రమిద్దాం" అని నిర్ణయించుకొని పాండవులు వైకుంఠానికి వెళ్లినారు. పవిత్రమైన జీవితాన్ని గడిపినవారు పాండవులు. అటువంటి పుణ్యమూర్తులవల్లనే భారతదేశమునకు గొప్ప పేరు వచ్చింది. కాని, ఈనాడు అట్టి పవిత్రత క్షీణించిపోయింది. అయితే, పవిత్రత లేకపోలేదు. కాని, అందరికీ కనిపించేటట్లుగా లేదు. 'ధర్మో రక్షతి రక్షితః'. ధర్మమే అందరినీ రక్షిస్తుంది. కనుక, ఆడ మగ ఇరువురూ ధర్మాన్ని కాపాడుకోవాలి. ఇందు నిమిత్తం మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా ఉంచుకోవాలి. పిచ్చిపిచ్చి ఆలోచనలకు చోటివ్వకూడదు.

అహల్య మహాగుణవంతురాలు. అయినా భర్త శాపానికి ఆమె గురికావలసి వచ్చింది. రాయిగా పడి ఉండమని ఆమె భర్త శపించాడు. ఆ తరువాత రాముని అనుగ్రహంచేతనే ఆమెకు శాపవిమోచనం కలిగింది. రాముని పాదస్పర్శ సోకిన తక్షణమే రాయి అహల్యగా మారిపోయింది. ఈవిధంగా భగవంతుడు అపవిత్రమును పవిత్రము గావిస్తాడు, మాలిన్యమును పరిశుద్ధము గావిస్తాడు. మనస్సులో ఎన్ని చెడ్డ భావములు కలిగినప్పటికీ భగవంతుని తలుచుకుంటే ఆ మాలిన్యమంతా నిర్మూలమైపోతుంది. అన్నింటికీ మన మనస్సే కారణం. స్త్రీలుగాని, పురుషులుగాని హృదయాన్ని పరిశుద్ధం గావించుకోవాలి. అప్పుడే మానవత్వం మానవత్వంగా నిలుస్తుంది; లేకపోతే దానవత్వంగా మారిపోతుంది.

**(తేదీ 1.10.2006, విజయదశమి, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vahini vacharamrutam